ఏఎన్‌ఆర్‌కు స్వర నీరాజనం



చిక్కడపల్లి: అక్కినేని నాగేశ్వర్‌రావు చిరస్మరణీయుడని వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామారాజు అన్నారు. వాగ్దేశ ఆశ్రమం కుంట్లూరులో ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ (గిఫ్ట్) ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వర్‌రావు శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం శుక్రవారం సాయంత్రం ఆయన వివేకనగర్‌లో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా అక్కినేని నటించిన సినిమాల్లోని పాటలు పాడి స్వర నీరాజనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ, అతిథులు కామేష్, రవికుమార్, శ్రీహరిరావు, వినయ్‌బాబు, ఇందునయన, లలిత, శ్రీనివాస్, సుధామయి, ఎస్.శైలజ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య చరిత్రలో శిఖర సమానులు
కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి



చిక్కడపల్లి: విశ్వనాథ సత్యనారాయణ దేశ సాహిత్య చరిత్రలో శిఖర సమానులని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభ కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ యాదిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహీర్షికతో కళా సంగీత నాట్యవేదికలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనచారి మాట్లాడుతూ సాహిత్య సృష్టిని అందరికి అందించిన వ్యక్తి విశ్వనాథ సత్యనారాయణ అని కొనియాడారు. ఆయన రచించిన వేయిపడుగలు సుదీర్ఘ నవల నాటి సామాజిక ఆర్థిక సాంస్కృతిక పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. హాస్యావధాని శంకరనారాయణ మాట్లాడుతూ.. కవి, కథకుడు, నవలా రచయిత, ఉత్తమ ఉపాన్యాసకుడన్నారు. ఈ కార్యక్రమంలో కళా జనార్ధనమూర్తి, గీతాదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైడ్రా భయం పట్టుకుంది!

మూసీ బఫర్ జోన్ వాసుల్లో మొదలైన ఆందోళన

- స్వచ్ఛందంగా షెడ్లను తొలగించుకుంటున్న నిర్మాణదారులు
- హైడ్రా పరిధిలోకి రాకున్నా హడలెత్తిపోతున్న పరీవాహక ప్రాంత ప్రజలు
- ఇప్పటికే అంబర్‌పేట మండల పరిధిలో 1154 నిర్మాణాలకు మార్కింగ్
- నోటీస్ లేకుండా కూల్చివేస్తారనే ఆందోళనలో యజమానులు

అంబర్‌పేట: హైడ్రా చర్యలతో హడలెత్తిపోతున్నారు. హైడ్రా చేపట్టిన చర్యలు బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణదారుల్లో గుబులు రేపుతోంది. హైడ్రా పరిధిలోకి రాకున్నా అలాంటి చర్యలు ఉంటాయని బఫర్ జోన్ నిర్మాణదారులు బెంబేలెత్తిపోతున్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో అధికార యంత్రాంగం గత నెల రోజుల క్రితం నిర్మాణాలకు మార్కింగ్ చేసింది. అంబర్‌పేట మండల పరిధిలో 1154 నిర్మాణాలకు మార్కింగ్ చేసి హద్దులు నిర్ణయించింది. మూసీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందంటూ వస్తున్న వార్తలతో పరీవాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని కృష్ణనగర్, శాస్త్రీనగర్, గోల్నాక లంకబస్తీలు, దుర్గానగర్‌తో పాటు ఆలీకేఫ్, హోల్‌సేల్ చికెన్ మార్కెట్‌లో ఉన్న నిర్మాణాల యాజమానులు తీవ్ర భయందోళనకు గురువుతున్నారు.

నష్టపోతామని స్వచ్ఛందంగా...

◆ పక్కా నిర్మాణాల యాజమానులు మినహాయిస్తే బఫర్ జోన్‌లో నిర్మించిన షెడ్ల యాజమానులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. హైడ్రా తరహాలో కూల్చి వేస్తే ఆర్థికంగా నష్టపోతామని భావిస్తున్నారు. ఆలీకేఫ్ హోల్‌సేల్ చికెన్ మార్కెట్‌లో ఉన్న కొన్ని రేకుల షెడ్లను స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. కనీస సమాచారం లేకుండా ఆకస్మత్తుగా తొలగింపు చర్యలు తీసుకుంటే షెడ్డులకు వినియోగించే రేకులతో పాటు అందులో ఉన్న సామగ్రి కోల్పోతామనే భయంతో కొంత మంది తొలగించుకుంటున్నారు. ఒకరిద్దరు స్వచ్ఛందంగా తొలగిస్తుంటే ఇతరుల్లో కూడా అభద్రత భావం ఏర్పడింది.

నోటీస్ లేకుండానే...

◆ మూసీ బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణలకు ఎలాంటి నోటీస్‌లు జారీ చేయకుండానే కూల్చి వేస్తారని ప్రచారం జరుగుతోంది. నోటీస్‌లు లేకుండా కూల్చివేత చర్యలు చేపడితే ఆర్థికంగా భారీగా నష్టపోతామని పలువురు భావిస్తున్నారు. పక్క నిర్మాణలు ఉన్న యాజమానులతో ముందస్తు సమాచారంతో ఇవ్వడంతో న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. తామకు న్యాయం చేయాలని ఇప్పటికే అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాను కూడా చేశారు. కనీస సమాచారం ఇచ్చాకనే ఏదైనా చర్యలు తీసుకోవాలని పలువురు భావిస్తున్నారు.

హైడ్రా పరిధికి రాకున్నా...

◆ మూసీ పరీవాహక ప్రాంతం హైడ్రా పరిధికి ప్రస్తుతానికి రాదు. మూసీ అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్‌మెంటు అథారిటీ పరిధిలోకి వస్తుంది. హైడ్రా తరహాలో ఈ సంస్థ చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ అభివృద్దే లక్ష్యంగా పలుమార్లు చేస్తున్న ప్రకటనలతో పరీవాహక నివాసితుల్లో గుబులు రేపుతోంది. ప్రస్తుతం దీనిపై ఎలాంటి స్పష్టత లేదు.

నోటీస్ ఇవ్వలేదు

మూసీ పరీవాహక ప్రాంతంలో ఇప్పటి వరకు మార్కింగ్ మాత్రమే చేశాం. ఇప్పటి వరకు ఎవరికీ నోటీస్‌లు ఇవ్వలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా మా చర్యలు ఉంటాయి.
– మీరాబాయి, అంబర్‌పేట తహసీల్దార్



ఆలీకేఫ్ చౌరస్తాలో స్వచ్ఛందంగా షెడ్డును తొలగించుకుంటున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు.

◆ శంకర్‌మట్ ఫీడర్ పరిధిలోని పద్మకాలనీ, నల్లకుంట, మాతృశ్రీ స్కూల్‌లో ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు..

◆ బర్కత్‌పురా ఫీడర్ పరిధిలోని వెజిటబుల్ మార్కెట్, నల్లకుంట, సిండికేట్ బ్యాంక్, నరేంద్రపార్కు, రామాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు..

◆ విద్యానగర్ ఫీడర్ పరిధిలోని అడిక్‌మెట్, బ్లెడ్‌బ్యాంక్, వడ్డెర బస్తీ, ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్, బౌదానగర్, వారాసిగూడ, జామాయి ఉస్మానియాలో మధ్యాహ్నం 12 నుంచి 12.30గంటల వరకు..

◆ అడిక్‌మెట్ ఫీడర్ పరిధిలోని రాంనగర్ గూండు, లలితానగర్, విద్యానగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 1.30 నుంచి 3గంటల వరకు..

◆ బాలాజీనగర్ ఫీడర్ పరిధిలోని అంబర్‌నగర్, గణేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2024–25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధానాచార్యులు డాక్టర్ ఎం.రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థికి పీజీలో 55 శాతం మార్కులు(ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం) ఉండాలన్నారు. పీజీతో పాటు స్లేట్, సెట్, నెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.98851 97765లో సంప్రదించాలని కోరారు.

'భావ తరంగాలు' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత మధుమోహన్ హృదయగిరి రచించిన భావతరంగాలు పుస్తకాన్ని శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కవిత్వం రాశారంటేనే కారణజన్ముడని భావించాలని అన్నారు. సమాజాన్ని చైతన్యం కలిగించే భావ కవిత్వాన్ని రచించడం గొప్ప విషయమని అన్నారు. విమర్శ అనేది మనిషి ఎదిగేందుకు ఉపయోగపడాలి తప్ప దిగజారేలా ఉండకూడదని అన్నారు. కవులు, కళాకారులను ప్రోత్సహిస్తే మరింత చైతన్యవంతమైన కవిత్వం రాయగలుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, బాలోత్సవం కార్యదర్శి సోమన్న తదితర ప్రముఖులు పాల్గొన్నారు.


భారతీయ సాంస్కృతిక వారధి శేషసాయి

ముషీరాబాద్: ప్రవాస భారతీయ సాంస్కృతిక వారధి రోయ్యూరు శేషసాయి అని హరియాణ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. దేశ విదేశాల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాల కోసం ఆయన విశేష కృషి చేస్తున్నారని అన్నారు. దీనిని గుర్తించి ఫిలామ్ ట్రోపిక్ సొసైటీ అధ్యక్షుడు డా. అద్దంకి రాజా సంస్థ ద్వారా ఎక్సలెన్స్ నేషనల్ అవార్డు–2024ను ఆయనకు అందజేశారు.

చదువే అన్ని సమస్యలకు పరిష్కారం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చదువే అన్ని సమస్యలకు చక్కటి పరిష్కారమని వీఎస్‌టీ యూనియన్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని కేవీకే గవర్నమెంట్ హై స్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన భ్యూలా అనే విద్యార్థినికి నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల చెక్కును అందజేశారు. అనంతరం వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతిభ కనబరుస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తమ ఫౌండేషన్ ప్రోత్సహిస్తోందని అన్నారు. వారు ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, వీఎస్‌టీ యూనియన్ నాయకులు బాబీ, నరేంద్రగౌడ్, రవియాదవ్, మల్లేష్, మధు, రణదీర్‌రెడ్డి, సత్యనారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చెంతకు బాలిక



చిక్కడపల్లి: తల్లిదండ్రులు మృతి చెందడంతో నబీరా అనే బాలిక నాగమయ్య కుంటలోని ఆమె తాత దగ్గర ఉంటోంది. మనవరాలు బాగోగులు చూసుకోవడానికి ఆ వృద్ధుడు ఇబ్బందులు పడుతున్నాడనే విషయాన్ని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలుసుకున్నారు. వెంటనే ఆయన ఆ బాలికను ఉంటున్న ఇంటిని సందర్శించి బాలిక తాతతో ఇన్‌స్పెకర్ మాట్లాడారు. బాలికను వెల్ఫేర్ కమిటీ అప్పగిస్తే చదువుతో పాటు బాగోగులు చూసుకుంటారని తెలిపారు. బాలిక తాత దానికి సమ్మతించడంతో నబీరాను శుక్రవారం సాయంత్రం లక్డీకపూల్‌లోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారికి చిక్కడపల్లి ఠాణాలో అప్పగించారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలి

చిక్కడపల్లి: జవహర్‌నగర్‌లోని టీఆర్టీ ప్లే గ్రాండ్ జనహిత గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, ఇన్‌చార్జి మల్లేష్‌తో కలసి కార్పొరేటర్ పావని పర్యటించారు. డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్యపై స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు సిబ్బందిని రప్పించి క్లినింగ్ వెహికిల్ ద్వారా మ్యాన్ హోల్‌లోని సిల్ట్‌ను తొలగింపచేసి పనులు జరిపించారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అధికారులను కార్పొరేటర్ ప్రశ్నించారు. వీలైనంత త్వరగా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... మలక్‌పేట–కాచిగూడ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (60) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఒంటిపై గోదుమ రంగు షర్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వకర్మ యోజనతో కుల వృత్తులకు పూర్వ వైభవం

పీఎంవీవై మొదటి వార్షికోత్సవంలో ఎంపీ ఈటల రాజేందర్

అంబర్‌పేట: కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకురావడానికే పీఎం విశ్వకర్మ యోజన (పీఎంవీవై) ముఖ్య ఉద్దేశమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. విద్యానగర్ శివం రోడ్డులోని నేషనల్ స్కిల్ ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం పీఎం విశ్వకర్మ యోజన మొదటి వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజల్వన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ... విశ్వకర్మ యోజనతో కేంద్రం కుల వృత్తులకు పెద్దపీట వేసిందన్నారు. దేశ పారిశ్రామికరణకు ఈ పథకం ఎంతో దోహద పడుతుందని తెలిపారు. వృత్తి నైపుణ్యంలో శిక్షణ పొందితే అపార అవకాశాలు యువతకు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ సుమతి, ఎల్‌డీఎం– ఎస్‌బీఐ జీఎం సుబ్రమణ్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శివం రోడ్డులోని ఎస్‌డీఐలో విద్యార్థుల ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల

4 లేబర్ కోర్టులు, 3 నేర చట్టాలను రద్దు చేయాలి

ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు



సమావేశంలో అభివాదం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

ముషీరాబాద్: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ శాశ్వత ఉద్యోగుల స్థానంలో కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కార్మికులను నియమిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం రెండు రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో అరుణ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వ్యవస్థలను పదిల పరచడం కోసమే 4 లేబర్ కోర్టుల అమలు అని, 3 నేర చట్టాలను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ నిర్మూలనకు కార్మిక వర్గం పోరాటాలలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సదస్సులో జాతీయ ఉపాధ్యక్షుడు ప్రదీప్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు ఎం.శ్రీనివాస్, జనార్దన్, అనురాధా, గడ్డం నాగరాజు, కుమార్, సాయిరామ్, సత్యనారాయణ, పద్మా, లీలా, సరోజా, యాదన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

కాచిగూడ: భారత్ సేవా కేంద్రం, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆన్–ది–జాబ్ ట్రెనింగ్ అండ్ ఇంటర్న్‌షిప్ కోసం సెప్టెంబర్ 21వ తేదీన పంజాగుట్టలో, 23వ తేదీన మణికొండలో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వెంకటరెడ్డి అడపా తెలిపారు. డిగ్రీ, పీజీ అండ్ ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణతో పాటు స్టైఫండ్ ఇస్తామన్నారు. వివరాలకు సెల్: 9959363083.

సన్మానం

కాచిగూడ: టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్ గౌడ్‌ను శుక్రవారం టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మారం జగదీష్ ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముజీబ్ హుస్సేన్, భాగ్యనగర్ టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డా. ముత్యాల సత్యనారాయణగౌడ్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలి

కాచిగూడ: డివిజన్‌లోని బాలప్పబాడ, లింగంపల్లి, కాచిగూడ పెంట్రోల్ బంక్ లేన్ తదితర ప్రాంతాల్లో రోడ్లు మొత్తం ధ్వంసమయ్యాయని కార్పొరేటర్ ఉమా అన్నారు. వెంటనే ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని శుక్రవారం డీఎంసీ మారుతీ దివాకర్‌కు ఆమె వినతి పత్రం అందజేశారు. నారాయణగూడ చౌరస్తాలోని మోడల్ మార్కెట్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ పనులు చేపట్టాలన్నారు. రోడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదని తెలిపారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

కాచిగూడ: ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు పిలుపునిచ్చారు. 'సేవ పక్వాడా'కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్, ఆనంద్‌గౌడ్, జయశ్రీ, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, కేశబోయిన శ్రీధర్, శ్యామ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య
- ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి




విద్యానగర్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య,బీసీ విద్యార్థి సంఘం నాయకులు

ముషీరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని శుక్రవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ నేతృత్వం వహించగా బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంత వరకు కుల గణన చేయడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం బీసీ రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. వేముల రామకృష్ణ మాట్లాడుతూ... ఫీజుల బకాయిలు రూ.4500 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, అంజి, అనంతయ్య, రామకోటి, పి.సతీష్, ప్రీతం,రవికుమార్, బాలస్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఉన్నత విద్యా కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కళాశాలలో బీఏ, బీకామ్, బీఎస్సీ, డిగ్రీ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొ. లింబాద్రి మాట్లాడుతూ.. ప్రణాళికబద్ధంగా విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుతారని అన్నారు. ఎంతో ఉన్నత ఆశయంతో దివంగత మాజీ కేంద్ర మంత్రి జి.వెంకటస్వామి అంబేడ్కర్ విద్యా సంస్థలను నెలకొల్పామన్నారు. ఇదే కళాశాలలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లు చదువుకున్నారని అన్నారు. అనంతరం ప్రొ. లింబాద్రిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డా. సరోజా, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపల్ మట్టా శేఖర్, వైస్ ప్రిన్సిపల్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత విద్యా కమిషన్ చైర్మన్ ప్రొ.లింబాద్రిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

యూనియన్ మహాసభలు విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశం

కాచిగూడ: కొత్తగూడెం పట్టణంలో సెప్టెంబర్ 22, 23వ తేదీల్లో జరిగే తెలంగాణ ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మహాసభల్లో డ్రైవర్లు, రవాణా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని మొత్తం అన్ని జిల్లాల నుంచి దాదాపు 3వేల మంది ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొనారు. ఈ సభను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై మహాసభలలో చర్చించి పలు తీర్మానాలు చేస్తామన్నారు.

ఎర్రజెండా పుట్టిందే పేదల కోసం..
దళితులే నా స్నేహితులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- తెలంగాణ చర్మకారుల సంఘాల జేఏసీ సదస్సులో ప్రసంగం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎర్రజెండా పుట్టిందే పేదల కోసమని... దళితులే తనకు స్నేహితులని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ చర్మకారుల సంఘాల జేఏసీ రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... కమ్యూనిస్టు భావజాలం ఉన్న వారే పేదల పక్షాన పోరాటం చేస్తారన్నారు. కులం కోసం మొదట పోరాటం చేసింది కమ్యూనిస్టులే అని గుర్తుచేశారు. సహపంక్తి భోజనాలు అలవాటు చేయడంతో పాటు రైతు కూలీ సంఘాలను ఏర్పాటు చేసి కర్షకులు, కార్మికుల్లో చైతన్యం నింపామన్నారు. ఆర్థిక సమానత్వం వస్తేనే కులం అనేది ఉండదని చెప్పారు. లాల్, నీల్ జెండాలు కలిస్తేనే సామాజిక స్ఫూర్తి పెరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ని నిజాయితీగా అమలు చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని తెలిపారు. చర్మకారుల సంఘాల జేఏసీ చైర్మన్ ఆరెపల్లి రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొ. కాశీం, డాక్టర్ రాజమౌళి, కూతపాటి శ్రీనివాస్, గొల్లపల్లి దయానంద్, పల్లెల్ల వీరస్వామి, మెరీ కుమారి మాదిగ, ఆనందరావు, నిర్మల, బి.రామూర్తి, జన్ను జకరయ్య తదితరులు పాల్గొన్నారు.



దద్దరిల్లిన ఆర్టీసీ క్రాస్‌రోడ్

మూడోరోజుకు చేరుకున్న ఆరోగ్య మిత్ర'ల సమ్మె

చిక్కడపల్లి: ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న ఆరోగ్యం మిత్రాలకు వేతనం ఇచ్చే విషయంలో అన్యాయం జరుగుతోందని సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమారస్వామి ఆరోపించారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమ్మె మూడో రోజుకు చేరుకున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ... ప్రభుత్వం విడుదల చేసిన జీవో 60లో అన్‌స్కిల్డ్ కార్మికులకు ఇచ్చే వేతనాన్ని వీరికి ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.